క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండలంలోని గ్రామాల్లో భూమి కలిగిన ప్రతి రైతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతి ద్వారా పంటలుసాగు చేసి ఆదాయం పొందాలని డివిజన్ ఇన్‌చార్జ్ రమేష్, రైతు సాధికార సంస్థ కమ్యూనికేషన్ టీమ్ సభ్యులు కీర్తన, మల్లేశ్వరి తెలిపారు. శనివారం టీడీపల్లి, కొత్తలం, ఏఆర్ రొప్పం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ సహజ వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటలు సాగు చేస్తే తెగుళ్ల వ్యాప్తి తగ్గి మంచి దిగుబడి పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. ఏటీఎం, ఏగ్రేడ్ మోడల్ విధానంపై రైతులకు వివరించారు. యూనిట్ ఇన్‌చార్జ్ మంజునాథ్, రైతు సేవా కేంద్రం, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఉచిత విద్య

పరిగి: రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలతో పాటూ కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలలో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లను ఉచితంగా పొందేందుకు అవకాశముందని ఎంఈఓ శేషాచలం తెలిపారు. శనివారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. రిజర్వేషన్ల ఆధారంగా ఒకటో తరగతిలో చేరే విద్యార్థులకు ప్రతి కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ప్రవేశాలు కల్పించడం జరుగుతుందన్నారు.

పోలీసుల తనిఖీలు

పెనుకొండ రూరల్: పట్టణంలోని రైల్వే స్టేషన్, బస్టాండ్, దర్గా సర్కిల్, పలు ప్రాంతాల్లో పుట్టపర్తి మహిళా డీఎస్పీ ఆదినారాయణ నేతృత్వంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది అనుమానితుల బ్యాగులను పరిశీలించారు.

దేదీప్యమానం.. కరగ అలంకారం



కరగ అలంకారంలో నల్ల రాళ్ల గంగమ్మ

పావగడ: స్థానిక నల్లరాళ్ల గంగమ్మ జాతరోత్సవంలో భాగంగా కరగ అలంకరణలో నల్లరాళ్ల గంగమ్మ శనివారం దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు గంగమ్మకు పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకుడు రాజేశ్ స్వామి పంచామృతాభిషేకం చేశారు.

డ్రైవింగ్ స్కూల్ పరిశీలన



రక్షా అకాడమీలో డ్రైవింగ్ ట్రాక్ పరిశీలిస్తున్న మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి

చిలమత్తూరు: మండలంలోని 44వ నెంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్‌లో ఉన్న రక్షా అకాడమీలో డ్రైవింగ్ స్కూల్‌ను రెవెన్యూ శాఖా మంత్రి రామప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన డ్రైవింగ్ ట్రాక్, స్టిమ్యులేటర్ సిస్టం వంటివి తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఫిట్‌నెస్ టెస్ట్‌లు ప్రైవేటుకు అప్పజెప్పే యోచనలో ప్రభుత్వం ఉందని, అందుకు కావాల్సిన సౌకర్యాలు ఇక్కడ ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖ అధికారి కరుణాసాగర్‌రెడ్డి, ఎంవీఐలు ఉదయ్ కుమార్, జైశ్రీయాదవ్, వరప్రసాద్, ఆర్టీఓ శ్రీనివాసులు, రక్షా అకాడమీ కమాండెంట్ నవీన్ త్యాగి, సిబ్బంది బాలాజీరావు, కరుణాకర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో సమస్యలు పరిష్కరించండి

మడకశిర: ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎన్ఎంయూ, ఈయూ నాయకులు వేర్వేరుగా మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డికి విన్నవించారు. శనివారం ఆయన పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ముందుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన క్రీడా వికాస కేంద్రాన్ని (ఇండోర్ స్టేడియం) ఎమ్మెల్యే ఎంఎస్ రాజుతో కలిసి మంత్రి ప్రారంభించారు. వైఎస్సార్ సర్కిల్‌లో రెండు ఆర్టీసీ కొత్త సర్వీసులను ప్రారంభించారు. హిందూపురం సర్కిల్‌లో జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజ చేశారు. అనంతరం ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలపై రెండు యూనియన్లు వేర్వేరుగా మంత్రికి వినతిపత్రాలు అందించాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ఆర్టీసీ, క్రీడాశాఖ అధికారులు పాల్గొన్నారు.

మరుగునపడుతున్న లక్ష్యం

- వృథాగా సామూహిక మరుగుదొడ్లు
- పలుచోట్ల ఆగిన నిర్మాణాలు
- రూ.లక్షల ప్రజాధనం వృథా
- పట్టించుకోని ఉన్నతాధికారులు



కొడిగెనహళ్లి సచివాలయం-2 వద్ద ఆగిపోయిన నిర్మాణం



మల్లాపల్లిలో అర్ధంతరంగా ఆగిపోయిన మరుగుదొడ్డి నిర్మాణం

పెనుకొండ రూరల్: సచివాలయాల వద్ద స్వచ్ఛ స్ఫూర్తి కనిపించడం లేదు. వివిధ పనుల నిమిత్తం సచివాలయాల వద్దకు వచ్చే ప్రజలు, సచివాలయ సిబ్బంది సౌకర్యార్థం నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన మరుగుదొడ్లు ముళ్లకంపల నడుమ దర్శనమిస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నూతన సచివాలయ భవన నిర్మాణాలు పూర్తయిన ప్రాంతాలను ఎన్నుకుని సాముహిక మరుగుదొడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రజా సమస్యలపై సచివాలయాలకు వచ్చే ఫిర్యాదుదారుల సౌకర్యార్థం ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.3 లక్షలు వెచ్చించింది. గ్రామీణ నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో వీటి నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. గతంలో వీటి బాగోగులను చూసే కార్మికులకు పంచాయతీ నిధులతో వేతనాలు ఇచ్చేవారు. 2021–22లో నియోజకవర్గం వ్యాప్తంగా 16 మరుగుదొడ్లు మంజూరయ్యాయి. వీటిలో ఇప్పటికే పది నిర్మాణాలు పూరయ్యాయి. మరో ఆరు వివిధ నిర్మాణ దశల్లో ఆగిపోయాయి. ఎన్నికల కారణంగా నిలిచిన పనులను పట్టించుకోవడం లేదు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా వీటి గురించి పట్టించుకునే అధికారులు కరువయ్యారు. ఇక పూర్తయిన మరుగుదొడ్లలో శుభ్రత చర్యలు చేపట్టక పోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. మరికొన్ని చోట్ల మరుగుదొడ్ల మధ్య ఏకంగా ముళ్ల కంపలు పెరగడంతో మరుగున పడిపోయాయి. సమస్యలతో సచివాలయాలకు వెళ్లే మహిళలకు మరుగుదొడ్లు ఉపయోగంలో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

నియోజకవర్గ వ్యాప్తంగా మరుగుదొడ్ల వివరాలు..		
మండలం	పూర్తయినవి	నిర్మాణంలో ఉన్నవి
సోమందేపల్లి	చాలకూరు-1, పందిపర్తి, బ్రహ్మసముద్రం	తుంగోడు, చల్లాపల్లి,
పరిగి	పరిగి-2	
	కొడిగినహళ్లి-1	కొడిగేనహళ్లి-2
రొద్దం	రొద్దం-1	-
	రొద్దం-3	-
	కోగిర-1	-
	పెద్దమంతూరు-1	-
పెనుకొండ	గుట్టూరు, కురుబ వాండ్లపల్లి	-
గోరంట్ల	మండలపల్లి	మల్లాపల్లి

సౌకర్యాలు మెరుగుపరచాలి



ప్రజల సౌకర్యార్థం సచివాలయాల వద్ద నిర్మించిన మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకునిరావాలి. అలాగే వివిధ దశల్లో ఆగిపోయిన మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే నిర్మించిన వాటిని ప్రజా సౌకర్యార్థం ఉపయోగించేందుకు అధికారులు చొరవ చూపాలి.

– బాబావలి, సీఐటీయూ మండల కన్వీనర్, పెనుకొండ

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



వివిధ సమస్యలపై సచివాలయాలకు వచ్చే గ్రామీణులకు మరుగుదొడ్ల నిర్మించేందుకు గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో పలు మరుగుదొడ్లు వివిధ కారణాలతో ఆగిపోయాయి. ఈ విషయాన్ని ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. నిర్మాణ దశలో ఉన్నవాటిపై కూడా నివేధికలు అందచేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.

– శివ నారాయణరెడ్డి, డివిజనల్ పంచాయతీ అధికారి

ఉగ్రదాడులను ఖండించాలి



రొద్దంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



నివాళులర్పిస్తున్న వైఎన్ హొసకోట ముస్లింలు

రొద్దం: జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ శనివారం మండల కేంద్రంలో శ్రీరామ భక్త మండలి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక పెద్ద అంజనేయస్వామి దేవాలయం నుంచి బస్టాండ్ వరకూ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా అర్చకుడు గిరీష్ స్వామి మాట్లాడుతూ.. పహల్గాంలో పర్యటకులను ఉగ్రవాదులు అతి దారుణంగా కాల్చి చంపారన్నారు. 26 మందిని పొట్టన పెట్టుకోవడం బాధాకరమన్నారు. ఈ దారుణాన్ని ఐక్యంగా ఖండించాలని పిలుపునిచ్చారు.

గోరంట్ల: పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ శనివారం మండల కేంద్రంలో శాంతి ర్యాలీ చేపట్టారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి బస్టాండ్ సర్కిల్ వరకూ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఉగ్రవాదుల దాడుల్లో మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకురాలని ప్రార్థించారు. ఉగ్రవాదం నశించాలని నినాదాలు చేశారు.

వైఎన్ హొసకోటలో..

పావగడ: కాశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో అమాయకులను బలిగొన్న ఉగ్రవాదులను శిక్షించాలని తాలూకాలోని వైఎన్ హొసకోట ముస్లింలు తెలిపారు. శనివారం స్థానిక ఈద్గా మైదానంలో వారు మాట్లాడుతూ పర్యాటకులను హత మార్చిన ఉగ్రవాదులను ఉరి తీయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జామియా మసీదు ముతవల్లి సాధిక్ సాబ్, కమిటీ నాయకులు ఇస్మాయిల్, కార్యదర్శి ముజుమిల్, నజీర్ సాబ్, అహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఈరన్న

అమరాపురం: మండలంలో సమస్యల పరిష్కారానికి చొరవచూపాలని ఎంపీపీ ఈరన్న కోరారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఏఓ మంజునాథ మాట్లాడుతూ రైతులకు అందిస్తున్న సబ్సిడీ పథకాలను వివరించారు. హౌసింగ్ ఏఈ త్రిశూల్ మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వం కొత్తగా ఇళ్ల నిర్మాణానికి అర్హుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. సభ్యుడు నారాయణ మాట్లాడుతూ అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలని, వైఎస్సార్‌సీపీ హయాంలో పార్టీలకతీతంగా ఇళ్లు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మనునాయక్ మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా నీటి సమస్య తలెత్తితే తనకు సమాచారం అందించాలని తెలిపారు. సభ్యులు హితేంద్ర, రసూల్‌బాషా, కెంచప్ప మాట్లాడుతూ శ్రీరామరెడ్డి తాగునీరు పది రోజుల నుంచి గ్రామాల్లో రాలేదని, దీంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు డీఈ దృష్టికి తెచ్చారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఈనెల 30లోపు కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈ సిద్దేశ్వర, సీడీపీఓ గంగరత్న, సూపర్‌వైజర్ కమలమ్మ, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యుడు రసూల్ బాషా, అధికారులు పాల్గొన్నారు.

రిలే దీక్షల విరమణ

చిలమత్తూరు: ఇంటి పట్టాల కోసం లబ్ధిదారులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలను అధికారులు విరమింపజేశారు. శనివారం డిప్యూటీ తహసీల్దార్ లబ్ధిదారులతో మాట్లాడుతూ అర్హులందరికీ ఇంటి పట్టాలిచ్చేలా చర్యలు తీసుకుంటామని, దీక్షల విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ జగన్నాథ్, ఎస్ఐ మునీర్ అహ్మద్, వైద్యాధికారి రామకృష్ణ నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపచేశారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

'ఇళ్ల పట్టాలు అందజేయండి'

హిందూపురం: హిందూపురంలోని కొట్నూరు వద్ద కాలనీలో పేదలకు పట్టాలివ్వాలని సీపీఎం టౌన్ కమిటీ మెంబర్ ఎంపీ రమణ డిమాండ్ చేశారు. పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరాహార దీక్షలు చేపట్టారు. అనంతరం తహసీల్దార్ వెంకటేష్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం, కేవీపీఎస్ నాయకులు సంజీవ రాయుడు, రామాంజి, సరస్వతి, అంజలి, సునీత తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి



తూమకుంట చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

హిందూపురం టౌన్: మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. శనివారం హిందూపురం ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయనతోపాటు అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్‌లు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులు, పెండింగ్ కేసులను, మద్యం అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన వాహనాలను పరిశీలించారు. అక్రమంగా మద్యం రవాణా చేస్తూ పట్టుబడిన వాహనాలను త్వరితగతిన క్లియర్ చేయాలని, కల్లు దుకాణాల నుంచి కల్లు శాంపిల్స్ సేకరించి చిత్తూరు కెమికల్ ల్యాబ్‌కు పంపించాలన్నారు. కల్తీ అరికట్టేలా కల్లు అమ్మకందారులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని ఆదేశించారు. అదేవిధంగా కర్ణాటక మద్యం అక్రమ రవాణాదారుల మీద కేసులు నమోదు చేసి, పాత ముద్దాయిలు, అనుమానితులను బైండోవర్ చేయాలన్నారు. రెండు అంతకుమించి ఒక వ్యక్తి మీద కేసులు నమోదైతే పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం తూముకుంట చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేశారు. అంతర్ రాష్ట్ర సరిహద్దులోకి వచ్చే వాహనాలు క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించాలని, మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ లక్ష్మీ దుర్గయ్య, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

17.28 లీటర్ల మద్యం స్వాధీనం

మడకశిర: నియోజకవర్గంలో శనివారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. స్థానిక సీఐ సోమశేఖర్, బీఎంపీపీ సీఐ గురునాథరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు. గుడిబండ మండలం ముతుకూరు క్రాస్‌లో అశోక్ అనే వ్యక్తి నుంచి 17.28 లీటర్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక నుంచి గుడిబండ మండలంలోకి మద్యం అక్రమంగా తరలిస్తున్నప్పుడు పట్టుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పరిచినట్లు వారు తెలిపారు.

ఇంటిని కూల్చేందుకు కుట్ర



టీడీపీ నాయకులతో కలసి ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

రొద్దం: మండల కేంద్రంలో నివాసం ఉంటున్న ముస్లిం వ్యక్తి నిసార్ ఇంటిని కూల్చేందుకు అధికారులు నోటీసులు జారీ చేశారు. శనివారం తహసీల్దార్ ఉదయశంకర్ రాజు సిబ్బందితో కలసి ఇంటి నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. అక్కడి స్థలాన్ని సర్వే చేయించారు. బాధితుడు నిసార్ మాట్లాడుతూ.. తాము చాలా ఏళ్లుగా ఇక్కడ నివాసం ఉంటున్నామని అధికరులతో మొరపెట్టుకున్నాడు. తమ పట్టాలో ఇల్లు నిర్మించుకున్నామని తెలిపాడు. అయితే అధికారులు మాత్రం కాలువ పొరంబోకు స్థలంలో ఇళ్లు, మరుగు దొడ్లు నిర్మించుకన్నారని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. తాము కలువ పొరంబోకుపై నిర్మాణం చేపట్టి ఉంటే అక్బర్ ఇంటి వరకూ నిర్మాణాలు మొత్తం తొలగించాలని అధికారులను కోరాడు. అయితే దురుద్దేశంతో కొందరు టీడీపీ నాయకులు కక్షగట్టి తొలగించేందుకు ప్రయత్నం చేస్తున్నారని వాపోయాడు. ఈ విషయంపై తహసీల్దార్‌ను సంప్రదించగా.. కాలువ పొరంబోకుపై నిర్మాణాలు చేపట్టడంతో నోటీసులు ఇచ్చామన్నారు. ఆ స్థలంలో సర్వే చేయించగా కాలువపై నిర్మాణం ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇంకా తొలగించలేదని బాధితుడికి నోటీసులు అందజేశామన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

హిందూపురం టౌన్: ప్రభుత్వ నిబంధనలు విరుద్ధంగా ముందస్తు ప్రచారాలు నిర్వహిస్తూ అడ్మిషన్లు చేసుకుంటున్న కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎంఈఓ గంగప్పకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బాబావలి మాట్లాడుతూ నిబంధనలు పాటించకుండా ముందస్తు ప్రచారాలు, అడ్మిషన్లు నిర్వహిస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుంచి వేల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ పాఠశాలల్లోనే పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, నోటుబుక్కులు, టైలు, షూస్ ఇతర సామాగ్రి కొనాలని నిబంధన పెట్టి అదనంగా, ఫీజు వసూలు చేస్తున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి నిబంధనలను ఉల్లంఘించే పాఠశాలలను సీజ్ చేయాలని, లేని పక్షంలో జిల్లా విద్యాధికారి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు హర్షకుమార్, జిల్లా సహాయ కార్యదర్శి భగత్, పట్టణ నాయకులు లిఖిత్, విక్రమ్, రోహిత్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వితంతు పింఛన్‌కు దరఖాస్తు చేసుకోండి

లేపాక్షి: 2023 డిశంబరు 1 నుంచి 2024 అక్టోబర్ 31 మధ్య కాలంలో 60 ఏళ్లు నిండిన భర్తకి పింఛన్ వస్తూ మృతి చెందినట్లెయితే స్పౌజ్ పెన్షన్ కింద మహిళ దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీఓ నరసింహమూర్తి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఆప్షన్ ఇచ్చిందన్నారు.

ఉచితంగా ఇంటర్ విద్య

హిందూపురం టౌన్: 2024–25 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో 500 పైబడి మార్కులు సాధించిన విద్యార్థులకు శ్రీ చిన్మయ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత విద్య అందిస్తామని ట్రస్టు డైరెక్టర్, శ్రీ చిన్మయ కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు వెంకట్ శనివారం తెలిపారు. పట్టణంలోని సువర్ణ భారతీ జూనియర్ కళాశాలలో మే 1, 2, 3న ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ టాలెంట్ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఇంటర్‌లో ఉచిత విద్య అందిస్తామన్నారు. టాలెంట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు 10వ తరగతి మార్కుల కార్డు, ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 7 013721155, 7416054685 నంబర్లలో సంప్రదించాలన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

లేపాక్షి: లేపాక్షిలోని రెవెన్యూ కార్యాలయం ఎదుట చలివేంద్రాన్ని శనివారం ఉదయం తహసీల్దార్ సౌజన్యలక్ష్మి ప్రారంభించారు. వేసవి కాలాన్ని దృష్టిలో వుంచుకుని చలివేంద్రంను ఏర్పాటు చేసామని ఆమె తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి రెవెన్యూ కార్యాలయానికి వారికి దాహం తీర్చుకోవడానికి చలివేంద్రంను ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా పశుపక్ష్యాదుల తాగునీటి కోసం కార్యాలయం ఆవరణలో నీటి తొట్టెలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

అగళి: మండలంలోని మాధుడి రోడ్డు వద్ద శనివారం సాయంత్రం ఎస్ఐ వీరేష్ వాహన తనిఖీలు చేశారు. వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ పత్రాలను పరిశీలించారు. నిబంధనలు అతిక్రమించి వాహనాలను నడిపితే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ హెచ్చరించారు. డ్రైవర్లు నిబంధనలు పాటించాలన్నారు.

కార్మికులకు సీఐటీయూ అండ

పెనుకొండ రూరల్: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని చేయాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని సాంఘిక సంక్షేమ హస్టల్ ఆవరణలో జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కార్మికులు రక్తాన్ని చిందించి పోరాటాలు చేసి సాధించుకున్న ఫలితమే మేడే అన్నారు. ప్రతి కార్మికుడికి సీఐటీయూ అండగా నిలిచి.. హక్కుల సాధనకు పోరాటాలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, బాబావలి, హరి, మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

దొంగల కోసం గాలింపు

పెనుకొండ రూరల్: కియా పరిశ్రమలో 900 ఇంజిన్లు చోరికి గురైన కేసులో తమిళనాడుకు చెందిన 8 మంది వ్యక్తులను పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో అసలు దొంగల కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నట్లు సమాచారం. పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి తమిళనాడు, ఢిల్లీ ప్రాంతాలకు విచారణ కోసం వెళ్లినట్లు తెలుస్తోంది.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహార ప్రాధాన్యతను వివరిస్తున్న దృశ్యం



అమరాపురంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామారావు

మడకశిర రూరల్: మండల పరిధిలోని చెందకచెర్లు తండా అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ్, బాల్య వివాహాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోషణ్ పక్వాడ్ కార్యక్రంపై అవగాహన ర్యాలీ చేశారు. సూపర్ వైజర్ శంకరమ్మ మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని తల్లిదండ్రులు, పిల్లలకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

అమరాపురం: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ రామారావు, తహసీల్దార్ లక్ష్మీ నరసింహులు తెలిపారు. శనివారం స్థానిక ఐకేపీ కార్యాలంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని సీడీపీఓ గంగరత్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంపీడీఓ, తహసీల్దార్, సీడీపీఓలు మాట్లాడుతూ గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, కోడిగుడ్డు, మొలకెత్తిన గింజలు తదితర వాటిని తప్పక తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ కమలమ్మ అంగన్‌వాడీ కేంద్రాల వారీగా రికార్డులు పరిశీలించారు.

సమయ పాలన పాటించాలి



ఆసుపత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి

హిందూపురం: వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలని, విధులను విస్మరిస్తే తగిన చర్యలు తప్పవని డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి హెచ్చరించారు. మండలంలోని కె.బసవనపల్లి ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా హాజరు పట్టీని తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అలాగే కేంద్రంలోని ఆయుర్వేదిక్ క్లినిక్ విభాగాన్ని పరిశీలించి ఆయుష్ వైద్యధికారిణి డాక్టర్ షకీలాబాతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారులు జయంత్ నాయక్, షకీలా బాను, సూపర్‌వైజర్ స్టాఫ్ ఈశ్వరమ్మ, ఇనాయత్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయండి

రొళ్ల: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ నాగమల్లేశ్వరి తెలిపారు. శనివారం పట్టణంలోని స్త్రీశక్తి భవనంలో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ షేక్షావలి, డాక్టర్ బాలప్రణీత్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఏసీ నాగరాజు, ఎఫ్‌పీఓ సీసీ భీమరాజుతో పాటు అంగన్‌వాడీ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూపిల్లల్లో పోషకాహార లోపాన్ని గుర్తించి, వైద్యుల సూచనల మేరకు ఎన్ఆర్‌సీకి రెఫర్ చేసే పద్ధతిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ సన్నమ్మ, జమేదార్ రామలింగయ్య, సీసీలు పాల్గొన్నారు.

'వైఎస్ జగన్‌ను విమర్శించే స్థాయి రాజుకు లేదు'

మడకశిర: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌ను విమర్శించే స్థాయి ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు లేదని వైఎస్సార్‌సీపీ కుంచిటి వక్కలిగ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రంగేగౌడు అన్నారు. శనివారం ఆయన మాట్లాడారు. చంద్రబాబు మెప్పు కోసం వైఎస్ జగన్ పై విమర్శలు మానుకొని ఇచ్చిన హామీలను నెరవేరిస్తే బాగుంటుందని ఎమ్మెల్యేకి సూచించారు. చేతనైతే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యేకి సవాల్ విసిరారు. అనవసరంగా వైఎస్ జగన్‌పై విమర్శలు చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. ఇంత వరకూ మడకశిరకు కృష్ణా జలాలు తీసుకురావడంలో విఫలమయ్యారని విమర్శించారు. నియోజకవర్గంలో తాగునీటికి ప్రజలు ధర్నాలు చేస్తున్నా పట్టించుకోలేదన్నారు. ఉపాధి లేక ప్రజలు వలసపోతున్నా మౌనంగా ఉన్నావని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తనకు చాలా ప్రాధాన్యత ఇస్తారని చెప్పుకునే రాజు.. నియోజకవర్గ సమస్యలపై దృష్టి పెట్టాలని హితవుపలికారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి కృషి చేయాలన్నారు. సూపర్ సిక్స్ హామీలపైనా దృష్టి పెడితే బాగుంటుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సోమందేపల్లి: మండల పరిధిలోని పేటకుంట సమీపంలోని డీఎస్సీ పరిశ్రమ ఎదుట శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో క్రిష్టా నాయక్ (52) మృతి చెందాడు. మృతుడు వెలుగుమాకుల పల్లి తండాకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. క్రిష్టా నాయక్ పశువుల కోసం కియా అనుబంధ పరిశ్రమలోని ఓ క్యాంటీన్ నుంచి రోజూ మిగిలిన ఆహారం తీసుకొచ్చేవాడు. శనివారం మిగిలిన ఆహారాన్ని క్యాంటీన్ నుంచి తీసుకుని ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. డీఎస్సీ పరిశ్రమ ఎదుట గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య దేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.